గ్రామాల్లో స్తంభించిన పాలన



అలుడి ఇందిరమ్మ కాలనీలో అపరిశుభ్రంగా ఉన్న దారి



అధ్వానంగా రావుడి సచివాలయ దారి

- వీధి లైట్ల నిర్వహణ, ధ్రువపత్రాల జారీ, పన్ను వసూళ్లు అస్తవ్యస్తం
- పడకేసిన పారిశుధ్యం
- వ్యాధుల కాలం కావడంతో ప్రజల ఆందోళన
- పంచాయతీ కార్యదర్శుల కొరతతో ఇబ్బందులు

అగళి: అసలే వర్షాకాలం.. అందులోనూ వ్యాధులు సంక్రమించే కాలం. మడకశిర నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. ఆయా పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శుల కొరత పట్టిపీడిస్తుండటంతో గ్రామాలను పట్టించుకునేవారే కరువయ్యారు.

అంతా అస్తవ్యస్తం

మడకశిర నియోజకవర్గంలోని వివిధ పంచాయతీలకు కార్యదర్శుల కొరత పట్టిపీడిస్తోంది. దీంతో పాలన స్తంభించి గ్రామాల్లో పారిశుధ్యం పనులు అటకెక్కాయి. ఒక్కో కార్యదర్శికి రెండు నుంచి మూడు గ్రామ పంచాయతీలు కేటాయించడంతో ఆయా గ్రామాలను పట్టించుకునే పరిస్థితులు కరువయ్యాయి. రక్షిత మంచినీటి పథకం సరిగ్గా లేక ఆయా గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధి లైట్ల నిర్వహణ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పన్నుల విధింపు, వసూళ్లతో పాటు పలు విభాగాల పనితీరు అస్తవ్యస్తంగా మరింది. ఆయా పంచాయతీల్లోని ప్రజలు కార్యదర్శుల కోసం మండల పరిషత్ కార్యాలయానికి వెళితే అక్కడ పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో లేక నిరాశగా వెనుదిరగాల్సి వస్తోంది. ఇన్‌చార్జి కార్యదర్శులు ఎక్కడ ఉంటారో ఎవరికీ తెలీడం లేదని ప్రజలు వాపోతున్నారు.

పంచాయతీ కార్యదర్శుల కొరత ఇలా..

మడకశిర నియోజకవర్గంలోని రొళ్ల మండలంలోని 10 గ్రామ పంచాయతీలకు కేవలం ముగ్గురు కార్యదర్శులు మాత్రమే ఉన్నారు. గుడిబండ మండలంలో 16 పంచాయతీలకు 10 మంది కార్యదర్శులు పనిచేస్తున్నారు. అగళి మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు ఐదుగురు కార్యదర్శులు మాత్రమే ఉన్నారు. 8 పంచాయతీల్లో ఇన్‌చార్జ్‌ల పాలన సాగుతోంది. అమరాపురం మండలంలో 11 గ్రామ పంచాయతీలకు 10 మంది కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. మడకశిర మండలంలో 16 గ్రామ పంచాయతీలకు 15 మంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కార్యదర్శుల నియామకం చేపట్టాలి

సూపర్ సిక్స్‌తో పాటు ఎన్నో హామీలను అమలు చేస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అర్హులకు సంక్షేమ ఫలాలు అందాలంటే సమర్థవంతమైన అధికారులు ఉండాలి. గ్రామస్థాయి అధికారులు అందుబాటులో ఉంటేనే సంక్షేమ ఫలాలు సక్రమంగా అందుతాయని ప్రజలు చెబుతున్నారు. పారిశుధ్యం, ధ్రువపత్రాల పంపిణీ తదితర పనులు చేసేందుకు పంచాయతీ కార్యదర్శులేక అవస్థలు పడుతున్నామంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ కార్యదర్శులు లేని గ్రామాలకు కార్యదర్శులను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



పంచాయతీ కార్యదర్శి లేక పోవడంతో గ్రామాల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా పారిశుధ్య పనులను పట్టించుకునేవారే లేకపోయారు. దీంతో రోగాల భయం వెంటాడుతోంది. అసలే వర్షాకాలం కావడంతో దోమలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం వెంటనే పంచాయతీ కార్యదర్శులను నియమించాలి. లేక అన్ని ప్రజలు ఇలాగేనే అన్ని విషయాల్లో ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– మైలరప్ప, ఇనగలూరు గ్రామం, అగళి మండలం

క్లుప్తంగా

పొంచి ఉన్న ప్రమాదం



వడ్రపాళ్యంలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ వైర్లు

మడకశిర: పట్టణంలోని 6వవార్డు (వడ్రపాళ్యం)లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ వైర్లు కాలనీలో అతి తక్కువ ఎత్తులో వేలాడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలీని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అంతేకాకుండా విద్యుత్ స్తంభాలు, అందులోని విడి భాగాలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయని చెబుతున్నారు. ఇటీవలనే పట్టణంలోని యాదవ కల్యాణ మండపం వద్ద విద్యుత్ వైర్లు పడి ద్విచక్ర వాహనంలో వెళుతున్న వ్యక్తి మృతి చెందినా విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వెంటనే విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకుని విద్యుత్ వైర్లను సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



మడకశిరరూరల్: మండల పరిధిలోని బచ్చలయ్యపాళ్యం గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో బుధవారం కొల్హాపురమ్మ విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. వేకువజామునే ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం



సీఐ రాజగోపాల్ నాయుడు

హిందూపురం అర్బన్: పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని వన్‌టౌన్ సీఐగా బుధవారం బాధ్యతలు చేపట్టిన రాజగోపాల్‌నాయుడు తెలిపారు. గతంలో వన్‌టౌన్, రూరల్‌లో సీఐగా పనిచేసిన అనుభవం ఉండటంతో ఎక్కడా ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, మట్కా, గ్యాంబ్లింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

అందరి సహకారంతో సమస్యల పరిష్కారం



నూతన తహసీల్దార్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

రొద్దం: కార్యాలయ సిబ్బంది సహకారంతో మండలంలో ఎలాంటి సమస్యలనైనా త్వరితగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ నాగేంద్ర అన్నారు. రొద్దం మండలానికి బదిలీపై వచ్చిన ఆయన బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

మడకశిరరూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం పాఠశాల అభివృద్ధి కోసం నిర్వహించే పాఠశాల కమిటీ ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ మనోహర్ తెలిపారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఘర్షణలకు చోటు ఇవ్వకూడదని, పాఠశాల అభివృద్ధికి దోహదపడే విధంగా కమిటీ ఎన్నికలు జరుపుకోవాలని కోరారు.

అధైర్య పడొద్దు.. పార్టీ అండగా ఉంటుంది



బాబు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మంగమ్మ

పెనుకొండ రూరల్: మండలంలోని అమ్మవారిపల్లికి చెందిన మాజీ వార్డు మెంబర్ బాబు అనారోగ్యంతో బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం చనిపోయారు. అక్కడి నుంచి స్వగ్రామానికి భౌతికకాయాన్ని తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మంగమ్మ, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పొగాకు రామచంద్ర మృతుని నివాసానికి చేరుకొని బాబు భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్య పడొద్దు.. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

బాధితులకు న్యాయం చేస్తాం

- డీఎస్పీ శ్రీనివాసులు



డీఎస్పీ శ్రీనివాసులు

గోరంట్ల: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైన ఉపేక్షించేదిలేదని, అలాంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పెనుకొండ డీఎస్పీ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం గోరంట్ల పోలీసుస్టేషన్ ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెనుకొండ సబ్‌డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షనే ధ్యేయంగా పోలీసు సిబ్బంది పనిచేసేలా చర్యలు తీసుంటామన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితునికి న్యాయం జరిగే విధంగా కృషిచేస్తానన్నారు. సంఘ విద్రోహ కార్యకాలపాలకు పాల్పడే వారి వివరాలను ప్రజలు పోలీసులకు అందించింది సహకరించాలని కోరారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. పెనుకొండ సబ్‌డివిజన్‌లో పనిచేసిన అనుభవంతో పాటు జిల్లాపై అవగాహన ఉందని, ప్రణాళికాబద్ధంగా పనిచేస్తామన్నారు. ట్రాఫిక్ సమస్యలను అధిగమించడంతో పాటు కర్ణాటక మద్యం విక్రయదారులపై చర్యలు చేపడతామన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- మిసెస్ ఇండియా సుప్రజాచౌదరి



పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న దృశ్యం

లేపాక్షి: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని మిసెస్ ఇండియా 2022 రైజింగ్ స్టార్ డాక్టర్ సుప్రజాచౌదరి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా పాఠశాల ఆవరణలో ఆమెతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. పర్యావరణం ప్రాముఖ్యత, ఉపయోగాలు, లాభాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. హిందూపురం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంతరెడ్డి మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాదు వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని తెలిపారు. లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ మాట్లాడుతు ఈ సారి 10వ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఫస్ట్ ప్రైజ్‌గా ల్యాప్‌ట్యాప్, రెండో బహుమతిగా రూ.25 వేలు, మూడో బహుమతి కింద రూ. 10 వేలు చొప్పున ప్రదానం చేస్తామన్నారు. పర్యావరణ వేత్తలు భాస్కర్‌రెడ్డి, చౌడప్ప, ఎస్ఐ గోపి, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అప్పగింత

సోమందేపల్లి: అదృశ్యమైన బాలికను పోలీసులు గుర్తించి అప్పగించిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్ కుమార్ వివరాలమేరకు... సోమందేపల్లిలోని దుర్గానగర్‌కు చెందిన రామచంద్ర కుమార్తె అనసూయ (13) అనే బాలిక అదృశ్యమైందన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న బాలిక మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి బుధవారం మధ్యాహ్నం అయినా రాకపోవడంతో తల్లిదండ్రులు తమకు ఫిర్యాదు చేశారన్నారు. అయితే వారం రోజులుగా పాఠశాలకు వెళ్లకుండా ఆ బాలిక బయట తిరుగుతున్నట్లు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం అనసూయ హిందూపురంలోని ముద్దిరెడ్డిపల్లిలో ఉన్న బంధువుల ఇంట్లో ఉన్నట్లు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు.

సందడిగా అథ్లెటిక్స్ మీట్



షాట్‌పుట్‌లో పాల్గొన్న బాలిక



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థినులు



లాంగ్‌జంప్ చేస్తున్న బాలిక

మడకశిరరూరల్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో మంచి నైపుణ్యం పెంచుకుని రాణించాలని ఆర్డీటీ ఆర్డీ మల్లికార్జున తెలిపారు. బుధవారం కల్లుమర్రి క్రీడా మైదానంలో ఆర్డీటీ ఏరియా స్థాయి బాలికలకు అథ్లెటిక్స్ మీట్ పోటీలను నిర్వహించారు. ఆర్డీ మాట్లాడుతూ ఈ పోటీలో గెలుపొందిన వారు సెప్టెంబర్ 2న నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. విద్య, క్రీడల అభివృద్ధిని ఆర్డీటీ ప్రోత్సహిస్తోందన్నారు. పురుషులతో సమానంగా బాలికలు క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం బాలికలు వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణమోహన్, పీఈటీ ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ గంగమ్మ, ఉపాధ్యాయులు, సంస్థ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బిడ్డల ఎదుగుదలకు తల్లిపాలు ముఖ్యం



రొళ్ల మండలం మల్లసముద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ వర్కర్లు

అగళి: తల్లిపాలు బిడ్డలకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి అన్నారు. బిడ్డల ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మండలంలోని కోడిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. లీలావతి మాట్లాడుతూ.. తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమని, బిడ్డపుట్టిన వెంటనే ముర్రుపాలను బిడ్డకు తాగించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టిహారాన్ని గర్భిణులు, బాలింత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవి పిల్లలకు పాలు తాగించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, అంగన్వడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: తల్లి ముర్రపాలు పిల్లలకు తాగించడం వల్ల చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటంతో పాటు రోగ నిరోధకశక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బీజీ హళ్లి పంచాయతీ పరిధిలోని మల్లసముద్రం అంగనవాడీ కేంద్రం ఆవరణలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగనవాడీ వర్కర్లు, ఆరోగ్య సిబ్బందితో పాటు గర్భిణులు, బాలింతలతో కలిసి గ్రామ పురవీధుల గుండా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త పద్మా, అంగనవాడీ వర్కర్లు మంజుల, నాగమణి, రత్నమ్మ, శివమ్మ, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: మండల పరిధిలోని కేకే పాళ్యం గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బాలింతలు, గర్భిణీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ ఎంపీహెచ్ఏ నూర్జహాన్, తేజశ్విని పాల్గొని తల్లిపాల విశిష్టతను వివరించారు. బిడ్డకు తల్లిపాలు ఆరోగ్యకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ వాణిజ్య సముదాయం ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

పెనుకొండ: పట్టణంలో నిర్మించిన వాసవీ వాణిజ్య సముదాయాన్ని బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ భవనాలు ఆర్యవైశ్య సమాజాభివృద్ధికి వ్యాపార, వాణిజ్య అవసరాలకు వినియోగించాలని వక్తలు కోరారు. సుధాకరగుప్తా, యాడికి నాగరాజు, సూర్యనారాయణ, శ్రీనాథ్, మోహన్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆడిటోరియం నిర్మాణానికి చర్యలు



విజేతకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ మాట్లాడారు. ఆడిటోరియం, తరగతి గదుల నిర్మాణాలను త్వరలోనే చేపడతామన్నారు. అంతర్ విశ్వవిద్యాలయాల రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన పావగడకు చెందిన భరత్‌తో పాటు పలువురు క్రీడాకారులు ట్రోఫీ అందజేశారు. ప్రిన్సిపాల్ డా మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

టింబక్టు ప్రతినిధులపై కేసు నమోదు చేయండి

పెనుకొండ: టింబక్టు ప్రతినిధులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కోగిర గ్రామానికి చెందిన నారాయణ, పలువురు కేవీపీఎస్ నాయకులు బుధవారం డీఎస్పీ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని తనను ఇష్టారాజ్యంగా దూషించారని, తనకు ప్రాణభయం ఉందని పేర్కొన్నారు.

నేడు మండల మీట్

పరిగి:మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుహాసినమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ సవిత అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

నేతన్నలను ఆదుకోండి

సోమందేపల్లి: సంక్షోభంలో కూరుకుపోతున్న చేనేత పరిశ్రమను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం నాయకులు డిప్యూటీ తహసీల్దార్ శంకర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఎలాంటి పూచికత్తు లేకుండా రూ.2 లక్షల వరకూ ముద్ర రుణాలు ఇచ్చి 50 ఏళ్లు నిండిన కార్మికులకు పింఛన్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు రాజగోపాల్, చాంద్‌బాషా, వెంకటేష్, శ్రీకాంత్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం

మండల కేంద్రంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు నారాయణస్వామి, బాలస్వామి, సుధార్, ఈశ్వర్, చాంద్ పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచండి

రొళ్ల: గ్రామాల్లో విరివిగా ఉపాధి కల్పించి కూలీల సంఖ్యను పెంచడానికి చర్యలు తీసుకోవాలని ఏపీఓ ఓబుళప్ప పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక మండ ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. జేఈ మారేగౌడు, టీఏలు, ఎఫ్ఏలు, సీఓలు పాల్గొన్నారు.

10న జ్యోతుల ఉత్సవం

అగళి: మండల పరిధిలోని కరిదాసనపల్లి గ్రామ సమీపంలో వెలసిన రావుడి ఆంజనేయస్వామి ఆలయ భవన సముదాయాన్ని శుక్రవారం ప్రారంభించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఇందులో భాగంగానే ఆ రోజు హోమాలు, పూజలు నిర్వహిస్తారన్నారు. శనివారం ఆంజనేయస్వామి జ్యోతుల ఉత్సవం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

పరిగి తహసీల్దార్‌గా హసీనా సుల్తానా



పరిగి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల తహసీల్దారుగా హసీనా సుల్తానా బుధవారం బాధ్యతలను స్వీకరించారు. గత సార్వత్రిక ఎన్నికల వేళ ఇక్కడ పని చేసిన అప్పటి తహసీల్దారు సౌజన్యలక్ష్మీ వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్లకు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి రాజేశ్వరీ తహసీల్దారుగా విధులు నిర్వర్తించారు. తాజాగా పరిగి మండల తహసీల్దారుగా హసీనా సుల్తానాను నియమించడంతో ఆమె బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా కల్లూరుకు చెందిన హసీనా సుల్తానా గతంలో హిందూపురం, రొళ్ల మండలాల్లో తహసీల్దారుగా విధులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటూ మండలంలో ఇసుక, మట్టి అక్రమ రవాణాపై ఆయా శాఖల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీనరసింహంతో పాటూ సీనియర్ అసిస్టెంట్ మురళీధర్, ఆర్ఐ సిద్దేశ్వర్ నూతన తహసీల్దారుకు ఘన స్వాగతం పలికారు.

చిలమత్తూరు తహసీల్దార్‌గా ఆనంద్‌కుమార్

చిలమత్తూరు: మండల నూతన తహసీల్దార్‌గా ఆనంద్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలు, భూసమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజలు నేరుగా తనను కలిసి తమ సమస్యలు చెప్పుకోవచ్చన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ సౌజన్యలక్ష్మి



లేపాక్షి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నూతన తహసీల్దార్‌గా సౌజన్యలక్ష్మి బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈమె కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అందరి సహకారంతో మండలానికి మంచి పేరు తీసుకొచ్చే విధంగా పని చేస్తామన్నారు.

పంట నమోదు చేసుకోండి

అమరాపురం: ఖరీఫ్‌లో భాగంగా మండలంలో పంటలు సాగు చేసిన రైతులు పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని ఏఓ మంజునాథ్ తెలిపారు. బుధవారం పంట వివరాల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. రైతు సేవా కేంద్రంలో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

రాజేశ్వరికి ఘన నివాళి



రాజేశ్వరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: మండల పరిధిలోని వైబీ హళ్లి గ్రామంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు భరత్‌భూషణ్‌రెడ్డి తల్లి స్వర్గీయ వైపీ రాజేశ్వరి వైకుంఠ సమారాధన కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, బాలకృష్ణారెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పరిశుభ్రతతో డయేరియాకు చెక్

పరిగి: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటూ పరిసరాల పరిశుభ్రతను తప్పక పాటించాలని మోదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి తెలిపారు. స్థానిక పాఠశాలలో బుధవారం వైద్యారోగ్య ఆధ్వర్యంలో డయేరియా (అతిసార) వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిశుభ్రతతోనే డయేరియాకు చెక్‌పెట్టొచ్చని ఉమాదేవి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.